సమగ్ర ఇంటింటి సర్వే 99శాతం పూర్తి

ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, నవంబర్25: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో 99 శాతం పూర్తయ్యిందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎన్యుమరేటర్‌కు కలెక్టర్ తమ కుటుంబ వివరాలను చెప్పారు. జిల్లాలో 2,46,167 ఇండ్ల సర్వే పూర్తయ్యిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం (1,64,857 ఇండ్లు) పట్టణ ప్రాంతాల్లో 97.37 శాతం (81, 310) సర్వే పూర్తయిందని కలెక్టర్ వెల్లడించారు.

ప్రజావాణికి 25 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 అర్జీలు వచ్చాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, దాసరి వేణుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ-6 , ఇతర శాఖలకు సంబంధించి 19 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ వెల్లడించారు.

పల్లె నిద్రతో ప్రజల వద్దకు పోలీసులు

రిసెప్షనిస్ట్ రజితను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాస్

ఓదెల, నవంబర్ 25: పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజల వద్దకు వెళుతున్నారని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రిసెప్షనిస్ట్ రజితను ఠాణాకు వస్తున్న ఫిర్యాదుదారులతో ఎలా మాట్లాడుతున్నారు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, పరిష్కారం అవుతున్న విధానం, శాంతిభద్రతలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రామగుండం సీపీగా తాను వచ్చిన తర్వాత పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టి పోలీసులను ప్రజల వద్దకు పంపిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా గ్రామాల్లో ప్రజలతో సమావేశం అవుతున్న ప్రజలు వారి సమస్యలతో పాటు అసాంఘిక కార్యలాపాల అడ్డకట్టకు సూచనలు ఇస్తున్నట్లు చెప్పారు. సీపీ వెంట డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ అశోక్‌రెడ్డి ఉన్నారు.

అనారోగ్యం తాళ లేక..

కాల్వశ్రీరాంపూర్, నవంబర్25: పెగడపల్లికి చెందిన తూడి కుమార్(40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. కుమార్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు హాస్పిటళ్లలో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీనికి తోడు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన కుమార్ ఈనెల 20న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి సోమవారం చనిపోయాడు. కుమార్‌కు భార్య శ్రేయ, కుమారుడు మహాదేవ్ ఉన్నారు. తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేశోరాం లో సమ్మె విజయవంతం

- రాత్రి వరకు కొనసాగిన కాంట్రాక్టు కార్మిక సంఘం సమ్మె
- హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ హామీతో విరమణ

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి

పాలకుర్తి, నవంబర్25: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల సమ్మె సోమవారం విజయవంతమైంది. ఉదయం షిప్టు నుంచి కార్మికులు అందరు సామూహికంగా సమ్మెలో పాల్గొన్నారు. హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ పార్థ సారథి అభ్యర్థించినా ఉదయం షిప్టులో కార్మికులు విధులకు హాజరుకాలేదు. రూ.51500 దీపావళి బోనస్ ఇచ్చే దాకా సమ్మె కొనసాగిస్తామని కార్మికులు పేర్కొన్నారు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్ నగర్ ఎస్ఐ స్వామి, స్పెషల్ పార్టీ పోలీసులతో కర్మాగారం ఆవరణలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

సమ్మె విరమించిన కార్మికులు

యాజమాన్యానికి, కార్మికసంఘాలకు మధ్యవర్తిగా ఏఎల్‌సీ యూసుఫ్ పర్మినెంట్ కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపుమనోహార్‌రెడ్డిని చర్చలకు పిలిచారు. పర్మినెంట్ కార్మికులు శనివారం నోటీసు ఇచ్చి సోమవారం సమ్మె చేయడం చట్టవిరుద్ధమని, సమ్మె విరమించాలని కోరారు. ఏఎల్సీ సూచన మేరకు రాత్రి సమ్మె విరమించి, నైట్‌షిప్టు విధులకు హాజరుఅవుతామని పర్మినెంటు కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి తెలిపారు.

హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ హామీ

తాము చట్టప్రకారం యాజమాన్యానికి నోటీసు ఇచ్చి, సమ్మె చేస్తున్నామని, మెరుగైన బోనస్ ఇచ్చేవరకు సమ్మె కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకుడు, యూనియన్ అధ్యక్షుడు కౌశికహరి తెలిపారు. యాజమాన్యం 40 ఏళ్లుగా పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన బోనస్ ఇస్తున్నదన్నారు. కాంట్రాక్టు కార్మికులు సైతం సమ్మె విరమిస్తున్నట్టు యూనియన్ అధ్యక్షుడు కౌశికహరి పేర్కొన్నారు. రాత్రి హెచ్ ఆర్ వైస్ ప్రెసిడెంట్ పార్థసారథితో కాంట్రాక్టు కార్మికులు సమావేశమయ్యారు. కాంట్రాక్టు కార్మికులకు సైతం బోనస్‌లో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు.

మెరుగైన బోనస్ ఇవ్వాలి

కేశోరాం కర్మాగారం పర్మినెంట్ కార్మికసంఘానికి స్థానిక ఎమ్మెల్యే గౌరవాధ్యక్షుడిగా ఉన్నాడని, యాజమాన్యాన్ని ఒప్పించి మెరుగైన బోనస్ ఇప్పించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటిచందర్ డిమాండ్ చేశారు. కేశోరాంలో సమ్మె చేస్తున్న పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. మెరుగైన బోనస్ కోసం సమ్మె చేస్తున్న కేశోరాం కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కలిశారు. కార్మికులకు మద్దతు తెలిపారు.

విజయోత్సవ సభకు స్థల పరిశీలన

పెద్దపల్లి, నవంబర్25: నిరుద్యోగ యువతతో వచ్చే నెల 4న పెద్దపల్లిలో జరిగే విజయోత్సవ సభకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో సభావేదిక కోసం స్థల పరిశీలన చేస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని కలెక్టర్ సోమవారం పరిశీలించారు. విజయోత్సవ సభలో గ్రూప్ -4, ఇతర వివిధ పోటీ పరీక్షల్లో ఎంపికైన దాదాపు 9 వేల మంది అభ్యర్థులకు సీఎం ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తారని చెప్పారు. కలెక్టర్ వెంట పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య, తహశీల్దార్ రాజ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రం సందర్శన

పెద్దపల్లి రూరల్, నవంబర్ 25: పెద్దపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో పెద్దకల్వలలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం సందర్శించారు. వడ్ల కొనుగోలు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

మంథని/మంథని రూరల్, నవంబర్25 : వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారి శ్రీమాల సూచించారు. మంథని పీఏసీఎస్ కార్యాలయంలో డీసీవో శ్రీమాల, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ కొనుగోలు కేంద్రాల సూపర్ వైజర్లు, సెంటర్ ఇన్చార్జీలు, ట్యాబ్ ఆపరేటర్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీసీవో వివరించారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ డీసీవోను సత్కరించారు. అనంతరం శ్రీరాంనగర్, పుట్టపాకలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఏడీఏ అంజలి, సహకార శాఖ సూపరింటెండెంట్ మోరె శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీ నరేశ్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సూపర్ వైజర్లు, సెంటర్ ఇన్చార్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

జూలపల్లి, నవంబర్ 25 : పెద్దాపూర్‌లోని 'ఆదర్శ' పాఠశాలలో సోమవారం 'ఇండియా లిటరసీ ప్రాజెక్ట్' ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై కిశోర్‌బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత వివిధ కోర్సులు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కెరీర్ ప్లానర్లు, సార్ట్, సెల్ఫ్ డిక్షనరీలు పంపిణీ చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్ షాదుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ. 6987

పెద్దపల్లి, నవంబర్25: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటాలు పత్తికి గరిష్ఠ ధర రూ. 6987 లభించింది. 213 మంది రైతులు 783 సంచుల్లో తీసుకొచ్చిన 861 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. అత్యధికంగా రూ. 6987, అత్యల్పంగా రూ. 6011, మోడల్ ధర రూ. 6751 లభించిందని మార్కెట్ సెక్రటరీ దేవరాజ్ పృథ్వీరాజ్ వెల్లడించారు.

జాతీయ వర్క్‌షాప్ బ్రోచర్ విడుదల

రామగిరి, నవంబర్ 25: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్ పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. మిషన్ లెర్నింగ్ అండ్ బిగ్ డేటాపై నిర్వహించే వర్క్‌షాపులో పాల్గొనే విద్యార్థులు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, భోజనంతోపాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు కో-ఆర్డినేటర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 7981686589, 8688368187లలో సంప్రదించాలని సూచించారు.సూపరింటెండెంట్ రవికుమార్, కన్వీనర్ తిరుపతి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు నరహరి, శ్రీనివాస్ లాల్, వంశీ కృష్ణ, శ్రీధర్, సందీప్‌కుమార్, అంకిత, శరణ్ పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్ఐల బదిలీ

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 25: కాళ్వేరం జోన్ 1 పరిధి రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ సోమవారం ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్ రామగుండం ఎస్ఐ టీ ఉదయ్‌కిరణ్‌ను ఎన్టీపీసీ ఎస్‌హెచ్‌వోగా, ఎన్టీపీసీ ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ కే సతీశ్‌ను వీఆర్ రామగుండంకు, వీఆర్ రామగుండం ఎస్ఐ కే వెంకటేశ్వర్‌రావును చెన్నూరు ఎస్ఐ 1,2గా, మంచిర్యాల టౌన్ ఎస్ఐ 1,2 సీహెచ్ శాంతకుమార్‌ను జూలపల్లి ఎస్‌హెచ్‌వోగా, జూలపల్లి ఎస్‌హెచ్‌ఓ ఎన్ శ్రీధర్‌ను సీసీఎస్ పెద్దపల్లికి బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులో పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జైలు

రామగిరి నవంబర్ 25 : కల్వచర్లకు చెందిన బాలసాని సత్తమ్మ బైండోవర్ ఆంక్షలు ఉల్లంఘించగా రిమాండ్ చేసి జైలుకు పంపినట్లు మంథని ఎక్సైజ్ సీఐ రాకేశ్ కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సత్తమ్మ గతంలో గుడుంబా విక్రయించగా, రామగిరి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల సత్తెమ్మ బైండోవర్ ఆంక్షలను ఉల్లంఘించి తిరిగి గుడుంబా విక్రయించడంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా రూ. లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోవడంతో ఆమెను రిమాండ్ చేసినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లవద్దు

రామగిరి, నవంబర్ 25: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లవద్దని మంథని డీఎల్పీవో సతీష్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డేటా ఎంట్రీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. సర్వే సిబ్బందికి వివరాలు అందించని వారెవరైనా ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు.

కమాన్‌పూర్, నవంబర్ 25: సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీ త్వరగా చేయాలని డీఎల్పీవో కే సతీశ్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్వే వివరా ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కే భాస్కర్, కార్యదర్శులు కుమార్, అంబటి శంకర్ పాల్గొన్నారు.

త్వరలోనే దొంగలను పట్టుకుంటాం

కమాన్‌పూర్, నవంబర్ 25: మండల కేంద్రంలోని సాగి అంజలి ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుల్ని త్వరలోనే పట్టుకుంటామని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద రావు తెలిపారు. మండల కేంద్రంలోని సాగి అంజలి ఇంట్లో లేని ఎవరూ సమయంలో దొంగలు సుమారు 10 తులాల బంగారంతోపాటు రూ.1.10 లక్షలు అపహరించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై ప్రసాద్, సీసీఎస్ ఎస్ఐ చంద్రశేఖర్, క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ సోమవారం పరిశీలించారు.

సకాలంలో విధులకు హాజరు కావాలి

సుల్తానాబాద్, నవంబర్ 25 : ప్రభుత్వ దవాఖాన ఉద్యోగులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్నకుమారి సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానను సోమవారం తనిఖీ చేశారు. ఉద్యోగులు విధులకు ఆలస్యంగా హాజరైతే వివిధ గ్రామల నుంచి దవాఖానకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక

రామగిరి, నవంబర్ 25: భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు సెంటినరీకాలనీలోని వాణి సెకండరీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. వాణి స్కూల్ విద్యార్థులు రూపొందించిన 'వర్టికల్ ఫార్మింగ్ ఇన్ సిటీస్' అనే వర్కింగ్ నమూనా సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైంది. ఈనెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు గౌహతి ఐఐటీలో నిర్వహించే ఫెస్టివల్‌లో 9వ తరగతి విద్యార్థులు జాగృత్, దినేశ్, రిషికుమార్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కౌండిన్య పాల్గొననున్నారు. దక్షిణ భారతదేశం నుంచి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కౌండిన్య ఒక్కడే ఉండడం విశేషం. ఈ సందర్భంగా వీరిని కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

జ్యోతినగర్, నవంబర్ 25: రామగుండం ఎన్టీపీసీ కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు అగ్రిమెంట్ ప్రకారం ప్లాంటులో ఉద్యోగాలు కల్పించాలని ఎన్టీపీసీ భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు జీఎంను కోరారు. ఈ నెల 29న తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ -2 కింద 2400మెగావాట్ల నిర్మాణం కోసం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను పురస్కరించుకొని నిర్వాసితులు జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ భూనిర్వాసితులు కే సత్యనారాయణ, రఘు, కే రాజేశం, తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలి

జూలపల్లి, నవంబర్ 25 : జూలపల్లి ఎస్సీ, బీసీ కాలనీలోని సర్వే నంబర్ 275, 276లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా చర్చి నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ స్వర్ణకు కాలనీ వాసులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేట చెందిన కాదాసి శంకర్ అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టాడని, అపరిచిత మహిళలను ఇక్కడికి తీసుకువచ్చి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమాయకులను ప్రలోభాలకు గురి చేసి మతమార్పిడి చేస్తున్నాడని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపితే వాస్తవాలు బహిర్గతమవుతాయని వివరించారు. కార్యక్రమంలో నెరువట్ల ఆనంద్, నెరువట్ల లింగయ్య, మోదుంపెల్లి నర్సయ్య, వడ్లూరి అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

వైస్ ప్రిన్సిపాల్‌కు పాదాభివందనం చేస్తున్న ప్రిన్సిపాల్

ముత్తారం, నవంబర్ 25: దర్యాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ సోమవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్న విధానాలను ఏసీపీ వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని భోజనశాల, మైదానాన్ని పరిశీలించారు.

వైస్ ప్రిన్సిపాల్ కు ప్రిన్సిపాల్ పాదాభివందనం

ఏసీపీని ప్రిన్సిపాల్ సంతోష్ సన్మానించేందుకు రాగా, ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణికి ప్రస్తుత ప్రిన్సిపాల్ సంతోష్ గతంలో స్టూడెంట్. ఈ విషయం తెలుసుకొని ఏసీపీ ఆశ్చర్యపోయాడు. దీంతో ఏసీపీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణికి, ప్రిన్సిపాల్‌తో సన్మానం చేయించారు. ఈ సందర్భంగా సంతోష్ కృష్ణవేణికి పాదాభివందనం చేసి, ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చప్పట్లతో అభినందించారు. ఇక్కడ మంథని సీఐ బీ రాజు, ముత్తారం ఎస్ఐ గోపతి నరేశ్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు అభినందన

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 25: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ రాహుల్‌ను అధ్యాపకులు అభినందించారు. జలగావ్ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో ఈ నెల 12 నుంచి 21వరకు జరిగిన వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ క్యాంపులో ప్రతిభ చూపాడు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓఝా సన్మానించారు. శాతవాహన యూనివర్సిటీ నుంచి ఇద్దరు వలంటీర్లు క్యాంపులో పాల్గొని ప్రతిభ చూపారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మనోహర్ తెలిపారు. ఇక్కడ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సాంబశివరావు, డాక్టర్ ఎం నరేశ్, డాక్టర్ డీ కిరణ్మయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్ రూరల్,నవంబర్ 25: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గట్టెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. షాట్ పుట్ అండర్-12 బాలికల విభాగంలో జీ రమ్య ప్రథమ స్థానం, హఫ్సా ఐమాన్ ద్వితీయ, గౌసియా తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని హెచ్‌ఎం అన్నపూర్ణ, పీడీ ప్రణయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్పెక్ట్రా స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 25: కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సినీ హీరో రెబల్‌స్టార్ కృష్ణంరాజు మెమోరియల్ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో గోదావరిఖని స్పెక్ట్రా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. డీ జేమ్స్‌కు గోల్డ్‌మెడల్, పీ శ్రీరిషికి సిల్వర్‌మెడల్ సాధించారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు మొండయ్య, కోచ్ క్రాంతికుమార్, కరస్పాండెంట్ న్యాతని సాయిలీల, డైరెక్టర్ శ్యామ్ అభినందించారు.

రామగుండం రైల్వేస్టేషన్‌లో కార్డన్ సెర్చ్

జ్యోతినగర్, నవంబర్ 25: రామగుండం రైల్వేస్టేషన్‌లో సోమవారం గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పలు రైళ్లలో పోలీసులు విస్తృతంగా సోదాలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను తనిఖీలు చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ బయట ఉన్న ఆటోస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ఏసీపీ అవగాహన కల్పించారు. ఇక్కడ గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, సివిల్, ఆర్మ్‌డ్ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు దాదాపు 50మంది పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా యాకయ్య

జ్యోతినగర్, నవంబర్ 25: ఎన్టీపీసీలో నిర్వహించిన సీపీఎం జిల్లా మూడో మహాసభల్లో పార్టీ జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు సోమవారం ప్రకటించారు. జిల్లా కార్యదర్శిగా వై యాకయ్య, కార్యదర్శి వర్గసభ్యులుగా ఎరవెల్లి ముత్యంరావు, ఏ మహేశ్వరి, వేల్పుల కుమారస్వామి, ఎం రామాచారి, సభ్యులుగా జీ జ్యోతి, బీ గణేశ్, డీ కొమురయ్య, మెండే శ్రీనివాస్, ఎం సారయ్య, నాంసాని శంకర్, సీపెల్లి రవీందర్, కల్లెపల్లి అశోక్, సీహెచ్ శైలజ, ఎన్ భిక్షపతి ఎన్నికైనట్లు వెల్లడించారు.

గర్భిణుల కోసం 102 వాహనం కేటాయింపు

ధర్మారం,అక్టోబర్ 25: గర్భిణులను తరలించేందుకు నంది మేడారం పీహెచ్‌సీకి 102 వాహనాన్ని కలెక్టర్ కేటాయించినట్లు వైద్యాధికారి సుస్మిత తెలిపారు. ఆగస్టు 13న నిర్వహించిన సమీక్షలో 102 వాహనం సమకూర్చాలని తాను కలెక్టర్ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. లీజ్ ప్రతిపాదికన ప్రైవేటు వాహనాన్ని పీహెచ్‌సీకి కేటాయించినట్లు వివరించారు. వాహనాన్ని సమకూర్చిన జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి డాక్టర్ సుస్మిత కృతజ్ఞతలు తెలిపారు.

డిటోనేటర్స్ కంపెనీలతో జీఎం సమీక్ష

గోదావరిఖని, నవంబర్ 25: సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని భూగర్భ గనులు, ఓసీపీల్లో బొగ్గును వెలికి తీసేందుకు ఉపయోగించే ఎక్స్ ప్లోజివ్, మాన్యుఫ్యాక్చర్ డిటోనేటర్స్ సరఫరా చేసే కంపెనీల అధికారులతో ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో రీజియన్ జీఎం క్వాలిటీ బైద్య సమీక్షా సమావేశం నిర్వహించారు. గనుల్లో ఉపయోగించే ఈ మందుగుండు సాబగ్రి ఎక్స్ ప్లోజివ్‌లను లా అండ్ ఆర్డర్ కోసం మున్ముందు నిషేధించి వీటి స్థానంలో ఎలక్ట్రానిక్స్ డిటోనేటర్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

27న గోదావరి మహా హారతి

గోదావరిఖని, నవంబర్ 25: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రేపు సమ్మక్క, సారలమ్మ జాతర స్థలంలో బుధవారం తలపెట్టిన గోదావరి మహాహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ కోరారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఇక్కడ ఈసంపల్లి వెంకన్న, ఒజ్జల వెంకటేశ్వర శర్మ, తాటిపెల్లి వెంకన్న, గజల్లి వెంకటేశ్వర్లు, కొడూరి రమేశ్, పొన్నం ఆంజనేయులుగౌడ్, రాధారపు కనకయ్య తదితరులు ఉన్నారు.

రేపు వృత్తిశిక్షణ కోర్సుల ప్రారంభం

గోదావరిఖని, నవంబర్ 25: ఆర్జీ-1 సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత స్వయం ఉపాధికల్పనలో భాగంగా బుధవారం స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాలులో నిరుద్యోగ యువతకు టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను ప్రారంభించనున్నట్లు ఆర్జీ-1 అధికార ప్రతినిధి సోమవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు కమ్యూనిటీ హాల్‌కు చేరుకోవాలని సూచించారు.

సెపక్ తక్రా ఉపాధ్యక్షుడికి సన్మానం

సెపక్‌తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామగిరి, నవంబర్ 25: సెపక్ తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పూదరి సత్యనారాయణ గౌడ్‌ను బీఆర్ఎస్ నాయకులు సోమవారం సన్మానించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేసి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన నాయకుడు జక్కు రాకేష్, పట్టణ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, నాయకులు బుర్ర శంకర్ గౌడ్, రొడ్డ శ్రీనివాస్, ఇబ్రహీం, మట్ట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

సుల్తానాబాద్ రూరల్, నవంబర్ 25: కనుకుల మాజీ ఉప సర్పంచ్ షమీమ్ అఫ్జల్ తండ్రి అంకూస్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని భూపాలపల్లి మాజీ జడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిణి, రాకేష్ సోమవారం కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరి వెంట మాజీ వైస్ ఎంపీపీ శ్రీదేవిభాస్కర్, నాయకులు ఇబ్రహీం, రొడ్డ శ్రీనివాస్, మట్ట రాజు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

మహాధర్నాలో పాల్గొన్న దాసరి ఉష

పెద్దపల్లి, నవంబర్25:లగచర్లలో దళిత, గిరిజన రైతులపై జరిగిన దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా మానుకోటలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈధర్నాకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కాగా, పెద్దపల్లి నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష ధర్నాలో పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట డీఎస్పీ ధర్నా

పెద్దపల్లి టౌన్, నవంబర్ 25 : సీఎం రేవంత్ రెడ్డి మాటి మాటికి ఢిల్లీతో పాటు విదేశాలకు వెళ్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలులో నిర్లక్ష్యం చూపుతున్నదని ఆ పార్టీ నాయకులు విమర్శించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఇక్కడ పార్టీ జిల్లా కన్వీనర్ కనకం గణేశ్, నాయకులు ఆవునూరి సతీశ్, ఎదుల్ల శంకరయ్య, ఎండీ షరీఫ్, క్యాదాసి రమేశ్, ఆరెపల్లి అమర్, మాతంగి రేవంత్, శనిగారపు రాము, దిలీప్ కుమార్, గాజుల నాగరాజు, రాము దర్శన్, ముకేశ్ పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

పెద్దపల్లి టౌన్, నవంబర్ 25: కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు సోమవారం నిర్వహించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అబ్జర్వర్ మల్లేశ్‌గౌడ్ తెలిపారు. చైర్మన్‌గా ఎమ్మెల్యే విజయరమణారావు, ప్రెసిడెంట్‌గా డీ ధర్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తోట శంకర్, వైస్ ప్రెసిడెంట్‌గా భూషణవేన రమేశ్‌గౌడ్, బేబీ శ్రీనివాస్, సెక్రటరీగా కరుణాకర్, జాయింట్ సెక్రటరీగా ఎండీ షఫీ, సలహాదారుగా సీనియర్ కబడ్డీ కోచ్ కిష్టయ్య ఎన్నికైనట్లు తెలిపారు. ఇక్కడ పెద్దపల్లి ,రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల అసోసియేషన్ల బాధ్యలు తిరుపతి, సంపత్‌రావు, తాండ్ర శంకర్, సురేందర్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 25: మీర్జంపేటకు చెందిన నిమ్మ స్వాతి , సిరికొండ హరిణి అనే విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఎన్ఎఆర్ఐ పచ్చిక రేవంత్‌రెడ్డి తన మిత్రుల సహకారంతో ఒక్కొక్కరికి రూ. 50వేల చొప్పున అందజేశారు. స్వాతి బీటెక్‌లో, హరిణి ఎంబీబీఎస్ లో సీటు సాధించారు. వీరి ఆర్థిక పరిస్థితుల గురించి పచ్చిక సదాశివరెడ్డి -సుగుణ తన కుమారుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వారికి ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన ఉయ్యాల బాలకృష్ణగౌడ్ డాక్టరేట్ పొందగా సత్కరించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కమాన్‌పూర్, నవంబర్ 25: జూలపల్లికి చెందిన అర్జున్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బాధితుడికి కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి రూ.10 వేల సాయం అందజేశారు. దవాఖానలో చికిత్స పొందుతున్న అర్జున్‌కు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, మత్స్యగిరి రాము, జబ్బార్ ఖాన్, చొప్పరి సంతోష్ ఉన్నారు.

వీహెచ్‌ఆర్ చేయూత

అంతర్గాం, నవంబర్ 25: లింగాపూర్‌లోనిరుపేద విద్యార్థులు శివానీ, శిల్పానిలకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. నర్సింగ్ విద్యను పూర్తి చేసి వరంగల్‌లోని ప్రైవేట్ దవాఖానలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. మూడు నెలలు అక్కడి ప్రైవేట్ వసతి గృహంలో ఉంటూ శిక్షణ పూర్తి చేసుకోవాల్సి ఉంది. వారి ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల్ల హరీశ్ రెడ్డి స్పందించి రూ.15వేలు తన తల్లిదండ్రులు అనసూయ- రాంరెడ్డి ద్వారా అందజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
BUSINESS OFFER
★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ సంప్రదించండి: పెద్దపల్లి సెల్: 9346756075
NTK-325450

CHANGE OF NAME
I, ERALLA SAMPATH, S/o. KOMURAIAH, R/o. H.No. 11-2-385, Indiranagar, Godavarikhani,Ramagundam Mandal, Peddapalli dist, Telangana, have changed My name from SAMPATH AVUNURI to ERALLA SAMPATH,S/o. KOMURAIAH For all Purpose.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189